
లెక్కింపును పరిశీలిస్తున్న పార్టీల ఏజెంట్లు


లెక్కింపు కేంద్రంలో ఏఆర్వో ఆదర్శ్ సురభి


ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది


వీవీపాట్‌లోని గణాంకాల నమోదు దృశ్యం


అధికారులకు సూచనలిస్తున్న సీపీ సునీల్ దత్


గెలుపు ధ్రువీకరణపత్రం అందుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి

ప్రశాంతంగా లోక్‌సభ ఓట్ల లెక్కింపు


ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక

ఎన్నికలలో చివరి అంకమైన ఖమ్మం లోకసభ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన లెక్కింపు కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ లెక్కింపు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి పర్యవేక్షించారు.



లెక్కింపు కేంద్రం నుంచి వెళ్లిపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు

ప్రతి రౌండ్‌లోనూ

కాంగ్రెస్ హవా

» బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంకు


రఘురాం రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 4: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి సత్తుపల్లి సెగ్మెంట్‌లో భారీ స్థాయిలో మెజారిటీ లభించింది. సమీప బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థికి 70,407 ఓట్ల ఆధిక్యం వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయికి 19,440 ఓట్ల ఆధిక్యత రాగా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మూడున్నరరెట్లు మెజారిటీ లభించింది. మొత్తం 21 రౌండ్ల ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించింది. మొదటి నుంచి 21వ రౌండ్ వరకూ వరుసగా 1925, 3668, 3255, 2928, 3023, 2928, 3354, 3253, 3365, 2400, 4452, 3103, 3357, 3283, 4406, 3875, 3945, 3758, 2472, 4273, 3384 ఏక పక్షంగా కాంగ్రెస్‌కు మెజారిటీ దక్కింది. లోక్ సభ ఎన్నికల్లో సత్తుపల్లి సెగ్మెంట్‌లో మొత్తం 2,43,943 ఓట్లు ఉండగా 1,96,155 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 1,20,310 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 49,903 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 14,422 ఓట్లు లభించాయి. 11,520 ఓట్లు ఇతరులకు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్లు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో మొత్తం కలిపి లెక్కించటంతో సెగ్మెంట్ వారీగా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు రాలేదు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత జనతాపార్టీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావుకు 1882 ఓట్లు మాత్రమే లభించగా ప్రస్తుత లోక్ సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు సత్తుపల్లి సెగ్మెంట్‌లో 14,422 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల కంటే బీజేపీ ఈ సెగ్మెంట్‌లో ఓటు బ్యాంకును పెంచుకుంది.

వైరాలో వార్ వన్‌సైడ్

వైరా, జూన్ 4: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో వైరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి భారీ ఆధిక్యత లభించింది. అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సైతం రఘురామిరెడ్డి పూర్తి ఆధిక్యతను చాటుకున్నారు. 61,778ఓట్ల మెజార్టీ లభించింది. వైరా నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు 98,280ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 36,502ఓట్లు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 11,806ఓట్లు లభించాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కంటే ఇప్పుడు ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డికి 28,733ఓట్ల మెజార్టీ అధికంగా వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో రాందాస్‌నాయక్‌కు 33,045ఓట్ల మెజార్టీ రాగా ఇప్పుడు రఘురామిరెడ్డికి 61,778ట్ల మెజార్టీ లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 93,913ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి బాణోతు మదన్‌లాల్‌కు 60,868ఓట్లు లభించాయి. బీజేపీ మద్దతుతో పోటీచేసిన జనసేన అభ్యర్థి సంపత్‌నాయక్‌కు 2712ఓట్లు మాత్రమే లభించాయి. ఇప్పుడు జరిగిన ఓట్ల లెక్కింపులో 18రౌండ్లలో కూడా కాంగ్రెస్ ఆధిక్యతను ప్రదర్శించింది. అన్ని రౌండ్ల లోనే కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ సాధించారు.

'గూడెం' ప్రజల గుండెల్లో

'రామసహాయం'

» కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ

కొత్తగూడెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డికి భారీ మెజార్టీ లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు 28వైచిలుకు మెజార్టీని వచ్చింది. ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి నియోజకవర్గంలో 75,877ఓట్ల ఆధిక్యం లభించింది. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ రఘురెడ్డికి 1,05,102ఓట్లు రాగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి అభ్యర్థి నామా నాగేశ్వరరావు 29,225 ఓట్లు వచ్చాయి. బీజేపీ తరఫున పోటీచేసిన అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 27,234 ఓట్లు వచ్చాయి. దీనిలో కాంగ్రెస్ అభ్యర్థికి 75,875 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యే సాంబశివరావుకు ఇచ్చిన మెజార్టీ కంటే భారీ మెజార్టీతో ఎంపీగా పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థికి ఓటర్లు పట్టంకట్టారు.

రామసహాయం రికార్డు బ్రేక్

» తొలిరౌండ్ నుంచే కొనసాగిన ఆధిక్యం
» గతంలో ఎన్నడూలేని మెజార్టీ కైవసం
» ప్రతీ నియోజకవర్గంలోనూ అదేతీరు

ఖమ్మం, జూన్4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీగా గెలిచిన రామసహాయం రఘురామరెడ్డి రికార్డు బ్రేక్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మెజార్టీని కైవసం చేసుకున్నారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు రెండో స్థానంలో నిలవగా ఆయనపై రఘురాంరెడ్డి 4,67,847 ఓట్ల ఆధిక్యత సాధించారు. కౌంటింగ్ మెదలైనప్పటినుంచి మొదలుకుని కొనసాగిన 21 రౌండ్లలోనూ ఆయన తన మెజార్టీని పెంచుకుంటూ వచ్చారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం 16,31,039 ఓట్లు ఉండగా.. వాటిల్లో పోస్టల్ బ్యాలెట్లతో కలిసి 12,51,733 ఓట్లు పోలయ్యాయి. వాటిల్లో రామసహాయానికి 7,66,929 ఓట్లు రాగా... ఆయన సమీప ప్రత్యర్థి అయిన నామా నాగేశ్వరరావుకు 2,99,082 ఓట్లు లభించాయి. ఇక అంతటిస్థాయిలో మెజార్టీ గత పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నడూ లేని పరిస్థితి నెలకొంది.

2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన నామా నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు లభించగా.. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన రేణుకా చౌదరికి 3,99,397 ఓట్లు లభించాయి. కాగా ఆ సమయంలో 1,68,062 మెజార్టీ లభించింది. ఇదే అప్పటివరకు అత్యధిక మెజార్టీ కాగా.. ప్రస్తుత ఎన్నికల్లో రఘురాం రెడ్డి ఆ రికార్డును బ్రేక్ చేశారు. అంతేకాదు ఆయన పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ అదే తరహా మెజార్టీ కనబరిచినట్లుగా తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల పరంగా లెక్కిస్తే పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీ సాధించిన మెజార్టీ ఓట్లను దాటిమరీ ఆధిక్యత సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలో 7,33,293 ఓట్లను కాంగ్రెస్ సాధించగా.. బీఆర్ఎస్‌కు 4,67,639 ఓట్లు వచ్చాయి. ఆ రెండిటీ మధ్య వ్యత్యాసాన్ని పరిశీలించినప్పటికీ 2,65,654 ఓట్ల మెజార్టీ మాత్రమే ఉంది. ప్రస్తుతం దానికి అదనంగా 2,02,193 ఓట్లు వచ్చాయి.

ఆయా ఎన్నికల్లో ఓట్ల వివరాలు..

పార్టీ	2024(పా)	2019(పా)	2023(అ)
కాంగ్రెస్	7,66,929	3,99,397	7,33,293
బీఆర్ఎస్	2,99,082	5,67,459	4,67,639
బీజేపీ	1,18,636	20,488	16,696
ఇతర పార్టీలు	16,342	84,803	1,02,786
స్వతంత్రులు	43,512	51,852	29,372
నోటా ఓట్లు	6782	15,832	8,553
మొత్తం	12,51,283	11,39,831	13,58,339

● పా: పార్లమెంట్, అ: అసెంబ్లీ

భట్టిని మించి

రఘురాంకు ఓట్లు

మధిర, జూన్ 4: మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డికి 63,470 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇది గత అసెంబ్లీ ఎన్నికల్లో భట్టి విక్రమార్కకు వచ్చిన (35,452)దానికన్నా అధికం కావడం విశేషం. ముదిగొండ మండలంలో ప్రారంభమైన కాంగ్రెస్ ఆధిక్యం చింతకాని, బోనకల్‌లోనూ కొనసాగింది. మధిర వచ్చే సరికి రెట్టింపు అయింది. కాంగ్రెస్ పార్టీకి తొలినుంచి పట్టు ఉన్న ఎర్రుపాలెంలోనూ అత్యధికంగా ఆధిక్యం కనపడింది. నామా నాగేశ్వరరావు తన వ్యక్తి చరిష్మా పనిచేస్తుందని, సామాజిక వర్గం కలిసి వస్తుందని ఆశలు పెట్టుకున్నా ఏమాత్రం ప్రభావం చూపించలేదు. బీజేపీ అభ్యర్థి ప్రభావం కూడా పెద్దగా లేదు. మధిర నియోజకవర్గంలో మొత్తం 2,22,160 మంది ఓటర్లు ఉండగా 1,81,815 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 1,14,087 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 50,617 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 9,074 ఓట్లు పోలయ్యాయి.


విజయ సంకేతాన్ని చూపుతున్న రఘురాం

పాలేరులో కాంగ్రెస్‌కు పెరిగిన 'మెజారిటీ'

కూసుమంచి, జూన్ 4: ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా పాలేరు నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి స్వల్పంగా ఆధిక్యత పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 57,656 ఓట్ల ఓట్ల మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ అభ్య పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 129,820 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డికి 71,481 ఓట్లు వచ్చాయి. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి పాలేరు నియోజకవర్గంలో 1,19,431 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు 58,493 ఓట్లు లభించాయి. దీంతో కాంగ్రెస్‌కు 60,938 ఓట్ల ఆధిక్యత లభించింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పొంగులేటి కంటే రఘురాంరెడ్డికి 3,282 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. పాలేరు నియోజకవర్గంలో.. మొత్తం ఓట్లు 2,40,806 కాగా 2,01,721ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌కు 1,19,431, బీఆర్ఎస్‌కు 58,493, బీజేపీకి 12,283కి ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి 60,938 ఓట్ల ఆధిక్యం అభించింది.

హస్తానికి 'అసెంబ్లీ'ని మించిన ప్రజాదరణ

అశ్వారావుపేట, మే 4: ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి అశ్వారావుపేట అసెంబ్లీ పరిధిలో 42,927ఓట్లు మెజార్టీ ఓట్లు వచ్చాయి. మొత్తం 1,28,848ఓట్లు పోలవగా, కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి 76,116ఓట్లు, ఆయన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 33,189ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 9016ఓట్లు వచ్చాయి. 2019 పార్లమెంట్ ఎన్నికలలో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన నామా నాగేశ్వరరావుకు ప్రత్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రేణుకా చౌదరిపై అశ్వారావుపేట నియోజకవర్గంలో 31,253 ఓట్లు మెజార్టీ సాధించారు. 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నామా నాగేశ్వరరావుకు వచ్చిన ఓట్లు మొత్తం 33,189ఓట్లు గత పార్లమెంట్ ఎన్నికలలో ఆయనకు వచ్చిన మెజార్టీతో సమానంగా ఉండటం విశేషం. 2023 డిసెంబర్‌లో తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలలో అశ్వారావుపేట ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ 28,905ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఈ రోజు ఫలితాలు వెలువడిన పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థికి 42,927ఓట్లు వచ్చాయి.

మంత్రుల ఇలాఖాలో ఓట్ల పంట

» 'అసెంబ్లీ'ని మించిన మెజారిటీలు
» మంత్రి తుమ్మల నియోజకవర్గంలో 86,570ఓట్ల ఆధిక్యత
» భట్టి, పొంగులేటి నియోజకవర్గంలోనూ భారీ మెజారిటీలు

ఖమ్మం, జూన్4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం అసెంబ్లీ పరిధిలో ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థికి భారీ ఆధిక్యత లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఏడు నియోజకవర్గాల్లో 4,67,847ఓట్ల మెజారిటీ లభించగా ఒక్క ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోనే 86,570 ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1,25,459 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 38,889 ఓట్లు మాత్రమే లభించాయి. ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మంలో తుమ్మలకు 49,381ఓట్ల ఆధిక్యత లభించగా ఈసారి ఆ మెజారిటీ మరింత పెరిగింది.

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరులో 61,681 ఓట్ల మెజారిటీ లభించింది. కాంగ్రెస్‌కు 1,20,069 ఓట్లురాగా బీఆర్ఎస్‌కు 58,388 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరులో మంత్రి పొంగులేటికి 56,650 ఓట్ల ఆధిక్యత లభించగా ఈసారి లోక్‌సభలో ఆధిక్యత పెరిగింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో కాంగ్రెస్‌కు 63,470 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక్కడ కాంగ్రెస్‌కు 1,14,087 ఓట్లు,బీఆర్ఎస్‌కు 50,617 ఓట్లు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మధిరలో భట్టికి 35,452ఓట్ల ఆధిక్యత లభించింది.

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పార్టీలకు పోలైన ఓట్లు

పార్టీ	2024(పా)	2019(పా)	2023(అ)
ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	125459	69979	136016
బీఆర్ఎస్	38889	95001	86635
బీజేపీ	32398	6187	4040
ఇతర పార్టీలు	1492	10685	3814
స్వతంత్రులు	4078	4991	3794
నోటా	1777	5549	1925
మెజార్టీ	86570	25022	49381
పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	120069	57208	127820
బీఆర్ఎస్	58388	92082	71170
బీజేపీ	12648	2129	1815
ఇతర పార్టీలు	2816	17284	9594
స్వతంత్రులు	6805	9171	5932
నోటా	999	1973	520
మెజార్టీ	61681	34874	56650
మధిర అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	114087	63134	108970
బీఆర్ఎస్	50617	81932	73518
బీజేపీ	9074	1822	2021
ఇతర పార్టీలు	1953	17072	8532
స్వతంత్రులు	5358	5825	1870
నోటా	726	1449	1453
మెజార్టీ	63470	18798	35452
వైరా అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	98280	58139	93913
బీఆర్ఎస్	36502	65819	60868
బీజేపీ	11806	1689	2712
ఇతర పార్టీలు	2267	11508	8777
స్వతంత్రులు	6540	6569	1907
నోటా	724	1357	1230
మెజార్టీ	61778	7680	33045
సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	120190	63486	111245
బీఆర్ఎస్	50782	95423	91805
బీజేపీ	14626	2229	1882
ఇతర పార్టీలు	2926	8550	5796
స్వతంత్రులు	6823	8729	3986
నోటా	658	1509	635
మెజార్టీ	69408	31937	19440
కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	105402	55345	80336
బీఆర్ఎస్	29225	73394	37555
బీజేపీ	27240	4848	1945
ఇతర పార్టీలు	2545	11264	58738
			(జలగం-53789)
స్వతంత్రులు	6276	5128	7919
నోటా	1285	3036	1427
మెజార్టీ	76177	18049	26547
అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్			
కాంగ్రెస్	76116	31717	74993
బీఆర్ఎస్	33189	62970	46088
బీజేపీ	9283	1497	2281
ఇతర పార్టీలు	2232	8388	7535
స్వతంత్రులు	7544	11429	3964
నోటా	488	929	1363
మెజార్టీ	42927	31253	28905

నోట్: పా- పార్లమెంట్, అ- అసెంబ్లీ

ఖమ్మంలో టీడీపీ సంబురాలు

ఖమ్మం టీడీపీ కార్యాలయానికి వెళ్లి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు


ఖమ్మం టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో ఖమ్మంలో తెలుగుతమ్ముళ్లు సంబురాలు నిర్వహించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో మంగళవారం భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి ఫలితాలను వీక్షించారు. జనసేన పార్టీ నాయకులు కూడా టీడీపీ కార్యాలయానికి వచ్చి సంబురాల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయంత్రం బైకుర్యాలీ నిర్వహించారు.

టీడీపీ కార్యాలయానికి తుమ్మల

ఏపీలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం పట్ల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఫలితాల సరళిని చూసిన మంత్రి ఖమ్మంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీ కార్యకర్తల ఆనందంలో పాలు పంచుకున్నారు. వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫలించిన నేతల కృషి

» లభించిన ఆధిక్యతలు

ఖమ్మం, జూన్4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటు ఖమ్మం అటు మానుకోట లోక్‌సభ నియోజకవర్గాల్లో కనీసం మూడు లక్షలపైగా ఆధిక్యం రావాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు. అందుకు తగినట్లుగానే ఇటు ఖమ్మం అటు మహబాద్‌లో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యతలు లభించాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లాలో నేతల కృషిఫలితంగా అసెంబ్లీకి మించి ఆధిక్యతలు సొంతం చేసుకున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రులు జిల్లా వారే కావడంతో పాటుగా సీపీఎం,సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు మద్దతు ప్రకటించడం, ఇటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయకులు, కార్యకర్తలు అంతా ఉమ్మడిగా పనిచేయడంతో కాంగ్రెస్ భారీ ఆధిక్యత సాధించింది. కేంద్రమాజీమంత్రి రేణుకాచౌదరి, సినీహీరో వెంకటేష్ తదితరులు ప్రచారం నిర్వహించారు. అందరు నియోజకవర్గాల వారీగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించి కేడర్‌కు దశ,దిశ నిర్దేశించారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి మెజారిటీలు రావాలని సూచించారు. బీఆర్ఎస్ ఓటమి గాయంతో ఉందని, ఉత్సాహంగా పనిచేసి మెజారిటీలు సొంతం చేయాలని బూత్‌స్థాయిలో కేడర్‌ను కదిలించారు. కాంగ్రెస్‌లో వర్గాలు వేర్వేరుగా ఉన్నా అందరి గెలుపు కాంగ్రెస్ విజయం అన్నచందాన బూత్,మండల స్థాయిలో పనిచేశారు. ఫలితంగా ఖమ్మంలో రఘురాంరెడ్డికి 4,67,847 ఓట్ల ఆధిక్యత లభించింది.

మంత్రి పొంగులేటి స్వగ్రామంలో

బీజేపీకి అధిక్యం

కల్లూరు, జూన్ 4: ఖమ్మం లోక్‌సభ పార్లమెంట్ నియోజకవర్గానికి గాను బుధవారం జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామంలో బీజేపీ అధిక్యంలో ఉంది. కల్లూరు మండల పరిధిలో గల నారాయణపురం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డిల స్వగ్రామం. వీరిద్దరు రాజకీయంగా ఆ గ్రామంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

గతంలో ఏనాడు నారాయణపరంలో బీజేపీకి అంతగా ఓటు బ్యాంకులేదు. ఇటీవల కాలంలో నారాయణపురం నుంచి సుధాకర్‌రెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బీజేపీ తరుపున రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తుండగా, కాంగ్రెస్ తరుపున రాష్ట్ర రాజకీయల్లో మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరు ఆ గ్రామంలో రాజకీయ అధిపత్యం వహిస్తున్నారు. నారయణపురం గ్రామంలో మొత్తం 1340 మంది ఓటర్లు ఉన్నారు. అయితే గత నెల 13 తేదీన పోలింగ్ జరిగింది. స్థానికంగా బూత్ నెం 94 లో బీజేపీ 404 ఓట్లు, కాంగ్రెస్‌కు 315 ఓట్లు, బీఆర్ఎస్‌కు 16 ఓట్లు వచ్చాయి. బూత్‌నెం 95 లో బీజేపీ 197 ఓట్లు, కాంగ్రెస్‌కు 112 ఓట్లు, బీఆర్ఎస్‌కు 11 ఓట్లు వచ్చాయి. మొత్తం మీద ఆ గ్రామంలో గల రెండు బూత్‌లలో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కాంగ్రెస్‌పై బీజేపీ 174 ఓట్ల అధిక్యతను సాధించింది.

అయ్యో.. జొకో

గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అవుట్

సెమీస్‌కు గాఫ్, స్వియాటెక్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్య పరిణామం. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న పురుషుల డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. కుడి మోకాలి గాయం కారణంగా జొకో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఫ్రాన్సిస్కోతో జరిగిన ప్రీక్వార్టర్స్ పోరును అతికష్టమ్మీద నెగ్గిన జొకోవిచ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో నొప్పితోనే ఆ మ్యాచ్‌ను కొనసాగించిన జొకో.. చివరకు ఐదుసెట్ల పాటు పోరాడి గట్టెక్కాడు. మ్యాచ్ తర్వాత ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీయించగా, గాయమైనట్లు బయటపడింది. దీంతో జొకోతో క్వార్టర్‌ఫైనల్స్‌లో తలపడాల్సిన కాస్పర్ రూడ్ వాకోవర్‌తో నేరుగా సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించడంతో జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన నెంబర్‌వన్ స్థానాన్ని రెండోసీడ్ జానిక్ సిన్నర్‌కు కోల్పోనున్నాడు. ఇక, సిన్నర్ 6-2, 6-4, 7-6(3)తో దిమిత్రోవ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(2), 6-2తో హోల్గర్ రూన్‌ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియటెక్, మూడోసీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్వియటెక్ 6-0, 6-2తో ఐదోసీడ్ వొండ్రుసోవాను ఓడించగా.. గాఫ్ 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ జెబ్యూర్‌పై విజయం సాధించింది.

వేటకు వేళాయె!

టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు భారత్ సై

నేడు ఐర్లాండ్‌తో ఢీ

రాత్రి 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రోహిత్

న్యూయార్క్: భారత క్రికెట్ అభిమానులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం తమ తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో ఆడనుంది. 2007లో తొలి ప్రపంచకప్‌ను అందుకున్నాక భారత జట్టుకు ఈ మెగా టోర్నీ ఊరిస్తూనే ఉంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలాంటి అనుభవజ్ఞులు.. సూర్యకుమార్, పంత్, బుమ్రాలాంటి యువ ఆటగాళ్ల సహకారంతో ఈసారైనా కప్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఇక తాజా టోర్నీలో చిన్న జట్లు అద్భుతంగా పోరాడుతున్న సమయంలో ఐర్లాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. అలాగే ఈ జట్టుకు గతంలో పెద్ద జట్లకు షాకిచ్చిన అనుభవం కూడా ఉంది. ఆసీస్‌లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది. అలాగే ఇటీవల పాక్‌ను కూడా మట్టికరిపించింది. బల్బిర్నీ, స్టిర్లింగ్, వికెట్ కీపర్ టక్కర్‌లతో పాటు పేసర్ జోషువా లిటిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. అటు స్థానిక నసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్ ఎలా స్పందిస్తుందనేది ఇరు జట్లకు సవాల్‌గా మారింది. ఐపీఎల్ మాదిరి ఇక్కడ బ్యాటర్లు చెలరేగుదామనుకుంటే బోర్లా పడక తప్పదు. మంగళవారం దక్షిణాఫ్రికా-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఐర్లాండ్‌తో ఆడిన ఏడు టీ20ల్లోనూ భారత్ గెలిచింది.



స్టిర్లింగ్

ఓపెనింగ్ ఎవరో?: ఈ టోర్నీలో భారత్ ఓపెనర్లుగా ఎవరిని బరిలోకి దింపుతారనేది చర్చనీయాంశంగా మారింది. కోచ్ ద్రవిడ్ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోయినా.. రోహిత్‌కు జతగా కోహ్లీని ఆడించే అవకాశం ఉంది. అలా జరిగితే జైస్వాల్ బెంచీకే పరిమితమవుతాడు. ఐపీఎల్ ఫామ్‌ను విరాట్ ఇక్కడా కొనసాగిస్తే జట్టుకు లాభమే. వికెట్ కీపర్‌గా పంత్ ఆడడం ఖాయమే. సూర్యకుమార్‌తో పాటు శివమ్ దూబే, హార్దిక్ మిడిలార్డర్‌లో రానున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో లెఫ్టామ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను సైతం ఆడించనున్నారు. అయితే బుమ్రాకు జతగా రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. హార్దిక్ మూడో పేసర్‌గా సేవలందించనున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

ఐర్లాండ్: బల్బిర్నీ, స్టిర్లింగ్ (కెప్టెన్), టక్కర్, టెక్టర్, కాంఫర్, డాక్‌రెల్, డెలానీ, అడెయిర్, మెక్‌కార్తి, యంగ్, లిటిల్.

పిచ్, వాతావరణం: పిచ్ స్పందనపై అనిశ్చితి కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో శ్రీలంక 77 పరుగులకు కుప్పకూలింది. అటు సఫారీలు కూడా ఇబ్బందిపడ్డారు. స్పిన్, పేస్‌కు కూడా అనుకూలించడం సానుకూలాంశం.

ప్రణయ్‌కు రజావత్ షాక్

'ఇండోనేసియా'లో గాయత్రి జోడీ ముందంజ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ 21-17, 21-12తో మాజీ వరల్డ్ నెంబర్‌వన్ ప్రణయ్‌కు షాకిచ్చి రెండోరౌండ్ చేరాడు. మరో ఆరంభ రౌండ్ పోరులో లక్ష్యసేన్ 21-12, 21-17తో కెంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. ఇతర భారత షట్లర్లలో మహిళల డబుల్స్ ద్వయం గాయత్రి/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ జోడీ సుమిత్/సిక్కి రెడ్డి ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు.

విహారికి ఎన్‌ఓసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ జట్టు ఎంపికపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)-క్రికెటర్ హనుమ విహారి మధ్య గత సీజన్‌లో జరిగిన వివాదం గుర్తుందిగా! అప్పటి నుంచి తాను వేరే రాష్ట్రానికి ఆడతానని, ఇందుకోసం ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలంటూ రెండు నెలల్లో విహారి నాలుగుసార్లు ఈమెయిల్స్ పంపించినా స్పందించని ఏసీఏ.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓడడంతో ఒక్కసారిగా దిగొచ్చింది. ఈనెల 3వ తేదీన ఎన్‌ఓసీ జారీ చేసినట్టు లేఖ తయారు చేసి, విహారికి పంపించింది. కాగా, ఏపీ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీఏ కూటమికి 'ఎక్స్'లో అభినందనలు తెలిపిన విహారి.. 'కర్మ ఎవరినీ ఉపేక్షించదు' అని పోస్ట్ చేయడం గమనార్హం.

ఐదేసిన ఫరూఖీ

● అఫ్ఘానిస్థాన్ శుభారంభం
● 125 పరుగులతో ఉగాండా చిత్తు



ప్రొవిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌ను అఫ్ఘానిస్థాన్ ఘన విజయంతో ఆరంభించింది. రహ్మనుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్ధశతకాలతోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 125 పరుగుల తేడాతో ఉగాండాను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కాస్మాస్, మసాబా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. రాబిన్సన్ ఒబుయా (14), రియాజత్ అలీ షా (11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేశారు. రషీద్, నవీనుల్ చెరో 2 వికెట్లు తీశారు.

బిజినెస్

మదుపరి షాక్.. సూచీలు షేక్



'పోల్' పంచ్‌కు రక్తమోడిన దలాల్‌స్ట్రీట్

- ఒకదశలో 6,234 పాయింట్లు పతనమై 70,000 స్థాయికి జారుకున్న సెన్సెక్స్
- చివరికి 4,390 పాయింట్ల నష్టంతో 72,079 స్థాయి వద్ద ముగిసిన సూచీ
- ఇంట్రాడేలో నిఫ్టీ దాదాపు 2,000 పాయింట్లు డౌన్
- చివర్లో 1,379 పాయింట్ల నష్టంతో 21,885 వద్ద క్లోజ్
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అతిపెద్ద మార్కెట్ పతనం
- ఒకదశలో దాదాపు రూ.40 లక్షల కోట్ల సంపద ఉఫ్
- రూ.31 లక్షల కోట్ల నష్టంతో రూ.394.83 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబై: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్‌ను భారీగా కుదిపేశాయి. ఎన్డీఏకు సీట్లు 300 కంటే తగ్గడంతోపాటు బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం మార్కెట్ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో మంగళవారం సూచీలు కుప్పకూలాయి. నాలుగేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. దాంతో ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో సోమవారం ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒకదశలో 6,234.35 పాయింట్ల (8.15 శాతం) వరకు క్షీణించి దాదాపు 5 నెలల కనిష్ఠ స్థాయి 70,234.43 వద్దకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 4,389.73 పాయింట్ల (5.74 శాతం) నష్టంతో రెండు నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 72,079.05 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పతనమై 21,281.45 వద్దకు పడిపోయింది. ట్రేడింగ్ నిలిచేసరికి సూచీ 1,379.40 పాయింట్ల (5.93 శాతం) నష్టంతో 21,884.50 వద్ద స్థిరపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ 13 శాతం మేర క్షీణించాయి. ఆ తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అమ్మకాల సునామీలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయి రూ.394.83 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఒకదశలోనైతే మార్కెట్ సంపద దాదాపు రూ.40 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

మోదీ సర్కారు హయాంలో నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	నష్టం పాయింట్లు	నష్టం శాతం
2024 జూన్ 4	1,379.40	5.93
2022 ఫిబ్రవరి 22	531.95	3.06
2021 నవంబరు 26	509.80	2.91
2021 ఏప్రిల్ 12	524.05	3.53
2021 ఫిబ్రవరి 26	568.20	3.76
2020 మార్చి 23	1,135.20	12.98
2020 మార్చి 16	757.80	7.61
2020 మార్చి 12	868.25	8.30
2020 మార్చి 9	538.00	4.90

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. పలు ప్రభుత్వ రంగ షేర్లు పరిమితికి మించి పతనమవడంతో వాటిల్లో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 27 నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 15 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ సైతం రెండంకెల స్థాయిలో నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం హెచ్‌యూఎల్ మాత్రం 6 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లే ఇండియా 3 శాతానికి పైగా పెరిగింది.
- బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 8.07 శాతం క్షీణించగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 6.79 శాతం నష్టపోయింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా రంగాల సూచీలన్నీ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ 14.40 శాతం, పవర్ 14.25 శాతం పతనమవగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 13.07 శాతం, సర్వీసెస్ 12.65 శాతం, క్యాపిటల్ గూడ్స్ 12.06 శాతం, ఎనర్జీ 11.62 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈలో 3,934 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,349 కంపెనీల స్టాక్ నష్టాలు చవిచూశాయి. 488 మాత్రం లాభపడ్డాయి. 97 యథాతథంగా ముగిశాయి. కాగా, 292 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోగా.. 139 ఏడాది గరిష్ఠాన్ని చేరాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు క్షీణించి 83.51 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

అదానీ షేర్ల ఢమాల్ : నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత కార్పొరేట్ ప్రముఖుడిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ షేర్లు మహా పతనాన్ని చవిచూశాయి. ఇంట్రాడేలో అదానీ పోర్ట్స్ 25 శాతం వరకు క్షీణించింది. పలు కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద ఒక్కరోజులోనే రూ.3.64 లక్షల కోట్లు తగ్గి రూ.15.78 లక్షల కోట్లకు పడిపోయింది.

పీఎస్‌యూ స్టాక్స్ పరేషాన్ : ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల(పీఎస్‌బీ) షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఆర్ఈసీ షేరు ఏకంగా 24.07 శాతం క్షీణించగా.. పీఎఫ్‌సీ 21.62 శాతం, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 19.43 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 19.21 శాతం, ఓఎన్‌జీసీ 16.23 శాతం, కోల్ ఇండియా 13.54 శాతం, ఎన్‌టీపీసీ 14.52 శాతం నష్టపోయాయి. దాంతో నిఫ్టీ పీఎస్ఈ ఇండెక్స్ 16.38 శాతం పతనమై 9,475 స్థాయికి జారుకుంది. పీఎస్‌బీలదీ అదే పరిస్థితి. యూనియన్ బ్యాంక్ 17.65 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 15.15 శాతం చొప్పున నష్టపోయాయి. కెనరా బ్యాంక్ 13.45 శాతం, ఎస్‌బీఐ 13.37 శాతం తగ్గాయి. దాంతో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 15.14 శాతం దిగజారి 6,794.25 వద్దకు పడిపోయింది. పీఎస్‌బీలతోపాటు ప్రైవేట్ బ్యాంక్‌లూ భారీ నష్టాలను చవిచూశాయి. దాంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 7.95 శాతం క్షీణించి 46,928.60 వద్దకు జారుకుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▲	66,800 ▲	98,500 ▲
ముంబై	71,969 ▲	65,924 ▲	88,837 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ



హైదరాబాద్	480
వరంగల్	482
చిత్తూరు	563
విజయవాడ	450
గోదావరి	445
విశాఖపట్నం	450

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147
వరంగల్	147
కరీంనగర్	147
మహబూబ్‌నగర్	147
కర్నూలు	147
విశాఖపట్నం	135
గోదావరి	149
విజయవాడ	149
గుంటూరు	149
ఒంగోలు	149
చిత్తూరు	142
నెల్లూరు	142
అనంతపురం	149



అబ్ కీ బార్?

పవన్‌కల్యాణ్‌కు సినీ ప్రముఖుల అభినందనలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమితో పొత్తు కుదుర్చుకున్న పవన్ కల్యాణ్.. పిఠాపురంలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలలోనూ(21) జయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీల నుంచి అభినందలు వెల్లువెత్తాయి. "ఎవ్వరికి అందదు అతని రేంజ్.. రెప్ప తెరిచేను రగిలే రివెంజ్" అని పేర్కొంటూ.. 'ఓజీ టైమ్ బిగిన్స్' అనే ఓ సినిమా పోస్టర్‌ను నిర్మాణ సంస్థ డీవీవీ మూవీస్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, హీరోలు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి హృదయపూర్వక అభినందనలు" అని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్మాతల మండలి పేర్కొంది. మరోవైపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందుకున్న నారా చంద్రబాబునాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని .. ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒక అన్నగా గర్వంగా ఉంది



"డియర్ కల్యాణ్ బాబూ ..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని గెలిపించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్‌చేంజర్‌వి మాత్రమే కాదు, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది.

- చిరంజీవి

హృదయపూర్వక శుభాకాంక్షలు

చిరస్మరణీయమైన విజయం అందుకున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్న మీ కృషి, అంకితభావం, నిబద్ధత హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. మీ కొత్త రాజకీయ ప్రయాణానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను.

- అల్లు అర్జున్

మీ గెలుపు స్ఫూర్తిదాయకం

రీల్ లైఫ్‌లోనూ.. రియల్ లైఫ్‌లోనూ అసలు సిసలు హీరో అయిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు. ఈ గెలుపు కోసం మీరు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా.. ఓ పాఠంలా ఉంది. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.

- నాని

చరిత్రను సృష్టించారు

ఓ అభిమానిగా.. ఓ సోదరుడిగా నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో చరిత్రను సృష్టించారు. మీ సత్తాతో కూటమిని నిలబెట్టారు. ఈ విజయానికి మీరు అర్హులు. మీరెప్పటికీ మా పవర్‌స్టారే.

- నితిన్

తగిన ప్రతిఫలం దక్కింది

శుభాకాంక్షలు పవన్ కల్యాణ్. మీ కృషికి, అంకితభావానికి తగిన ప్రతిఫలం దక్కింది.

- కాజల్ అగర్వాల్

ఓం బిర్లా రికార్డ్

» స్పీకర్‌గా చేసి మళ్లీ ఎంపీగా ఎన్నిక

న్యూఢిల్లీ, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్పీకర్ ఓం బిర్లా ఓ రికార్డ్ సాధించారు. స్పీకర్‌గా చేసి మళ్లీ లోక్‌సభకు ఎన్నికైన నేతగా నిలిచారు. గత 20 ఏళ్లలో ఈ ఘనత సాధించింది ఓం బిర్లానే. గతంలో కాంగ్రెస్‌కు చెందిన పీఏ సంగ్మా 1996లో లోక్‌సభ స్పీకర్‌గా చేసి, 1998లో మేఘాలయా రాష్ట్రంలోని తురా నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఫీట్ సాధించింది ఓం బిర్లానే. 1999లో ఏపీలోని అమలాపురం నుంచి టీడీపీ తరపున గెలిచిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. బాలయోగి అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన శివసేన నేత మనోహర్ జోషి.. 2004లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి ఏక్‌నాథ్ గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు. 2004లో బోల్‌పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఎం నేత సోమ్‌నాథ్ చటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో సీపీఎంతో విభేదాలు రావడంతో ఆయన రాజకీయాల నుంచి నిష్క్రమించారు. 2009లో బిహార్‌లో ససరామ్ నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ సభ్యురాలు మీరా కుమార్ 15వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. 2014లో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నాయకురాలు సుమిత్రా మహాజన్.. 2019 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2019లో స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా.. ఇప్పుడు మళ్లీ ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

ఇండియా కొంప ముంచిన స్నేహపూర్వక పోటీ!

లేకుంటే కాంగ్రెస్ ఖాతాలో మరికొన్ని సీట్లు

» ఉమ్మడి అభ్యర్థులున్న చోట ఘన విజయం
» హిందీబెల్ట్‌లో ఫలించిన కాంగ్రెస్ వ్యూహం
» మిత్రుల పోటీతో పంజాబ్, బెంగాల్‌లో నష్టం

"బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు.." గత ఏడాది జూలై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి(40 పార్టీలు) సమావేశంలో సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం ఇది.! ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది.! క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. 'స్నేహపూర్వక పోటీ'ని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంప ముంచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిత్రుల మధ్య పోటీతో నష్టం

ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ ఆఘాడీ వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్‌పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంత మేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిల్లింది. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉంటే.. కాంగ్రెస్ కూటమికి ఈ మూడు రాష్ట్రాల్లో అదనంగా 11-16 సీట్లు వచ్చి ఉండేవని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహపూర్వక పోటీ పంజాబ్‌లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. ఖదూర్‌సాహిబ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి 3.76 లక్షల ఓట్లు రాగా.. అక్కడి ఆప్-కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 5.25 లక్షలకు పైనే..! ఫరీద్‌కోట్‌లో కూడా 2.96 లక్షలతో ఇండిపెండెంట్ అభ్యర్థి అగ్రస్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్, ఆప్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 3.8 లక్షలు. బఠిండాలో శిరోమణి అకాలీదళ్ 3.75లక్షలతో విజయం సాధించగా.. అక్కడ కూడా ఆప్-కాంగ్రెస్‌లకు వచ్చిన ఓట్ల సంఖ్య 5.25 లక్షలు. పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమిలోని టీఎంసీ, కాంగ్రెస్, సీపీఎం పరస్పర పోటీ వల్ల 8-10 సీట్లలో బీజేపీ పాగా వేసింది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో పోలిస్తే.. విడివిడిగా కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువ కావడం గమనార్హం.! కేరళలోని త్రిషూర్ నియోజకవర్గం నుంచి నటుడు, బీజేపీ అభ్యర్థి సురేశ్‌గోపీ ఘనవిజయం సాధించారు. అక్కడ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్ల కంటే.. సురేశ్‌గోపీ సాధించిన ఓట్లు దాదాపు 2.06 లక్షల మేర తక్కువ కావడం గమనార్హం. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలా వరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు. అక్కడ విడివిడిగా పోటీచేయకుండా ఉండిఉంటే.. భారీ మెజారిటీ వచ్చేదనేది నిర్వివాదాంశం.



సురేష్ గోపి

ఆ రాష్ట్రాల్లో గ్రాండ్ సక్సెస్..!

ప్రీపోల్ సర్వేలు మొదలు.. ఎగ్జిట్ పోల్స్ దాకా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హవా అంటూ ఫలితాలొచ్చాయి. మంగళవారం నాటి ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 80 స్థానాలున్న యూపీలో ఇండియా కూటమిదే పైచేయి అయ్యింది. 2014లో 77, 2019లో 62 సీట్లను సాధించిన బీజేపీ ఈ సారి 33 స్థానాలకే పరిమితమైంది. ఇందుక్కారణం.. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉండడమే..! బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ఈ ప్రయోగంతో గ్రాండ్ సక్సెస్ అయినట్లే. అంతే కాదు.. మహా వికాస్ ఆఘాడీ పేరుతో ముందు నుంచి కూటమిగా ఉన్న కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్ వర్గం), శివసేన(ఉద్ధవ్ వర్గం) 48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ 'ఉమ్మడి' ధర్మాన్ని పాటించాయి. ఫలితంగా 29 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఈ ప్రయోగం ఫలించింది. హిందీబెల్ట్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్ మినహా.. ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. గత ఎన్నికల్లో ఈ బెల్ట్‌లో బీజేపీ ఏకపక్ష హవా కొనసాగిన విషయం తెలిసిందే.!

- సెంట్రల్ డెస్క్

భారీగా పుంజుకున్న కాంగ్రెస్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ ఈసారి పుంజుకుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా 99 స్థానాల్లో విజయం సాధించింది. నిజానికి 2014లో 44 సీట్లు.. 2019లో 52 స్థానాలను మాత్రమే సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభలో విపక్ష పార్టీ హోదాను కూడా దక్కించుకోలేదు. ఓ దశలో బీజేపీ దూకుడుతో క్రమంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందా? అనే అనుమానాలు రాజకీయవర్గాల నుంచి వ్యక్తమైన నేపథ్యంలో.. రాహుల్‌గాంధీ రెండుసార్లు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లు ప్రజల్లో మళ్లీ ఆదరణను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా దక్షిణాదిన కేరళలో తిరిగి తన సత్తాను చాటుకోగా.. హిందీబెల్ట్‌లో ఆశించిన స్థాయిలో పురోగతిని నమోదు చేసుకుంది. వచ్చే ఎన్నికల్లోగా ఆ పార్టీ మరింత వేగంగా పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభకు రామాయణ్ రాముడు.. రచన.. కంగన..

ఎన్నికల్లో వివిధ పార్టీల తరపున మెరిసిన తారలు





న్యూఢిల్లీ, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో తారలు తళుక్కుమన్నారు. రామానంద్ సాగర్ రామాయణ్‌లో శ్రీరాముడి పాత్రధారి, బాలీవుడ్ నటుడు అరుణ్ గోవిల్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. యూపీలోని మేరఠ్ నుంచి పోటీచేసిన ఆయన ఎస్పీ అభ్యర్థి సునీతా వర్మపై 9,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ సినీనటి, తెలుగులో 'కన్యాదానం', 'మావిడాకులు', 'నేను ప్రేమిస్తున్నాను' వంటి చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ టీఎంసీ తరఫున విజయం సాధించారు. బెంగాల్‌లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె 74,048 ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నుంచి టీఎంసీ నుంచే బరిలో నిలిచిన బెంగాలీ సినిమా, టీవీ నటి సయానీ ఘోష్ 2.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. ఇప్పటికే ఓసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ మలయాళీ నటుడు సురేశ్ గోపీ కేరళలోని త్రిషూర్‌లో విజయం సాధించి, లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి బీజేపీ నుంచి రేసులో నిలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ 74,755 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన భోజ్‌పూరి నటుడు మనోజ్ తివారీ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కన్హయ్య కుమార్‌పై 1,22,135 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని అసన్సోల్ స్థానం నుంచి పోటీ చేసిన సిటింగ్ ఎంపీ, ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన బాలీవుడ్ సీనియర్ నటుడు శత్రుఘ్న సిన్హా, బీజేపీ అభ్యర్థి సురేంద్రజీత్‌పై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి హేమామాలిని యూపీలోని మథుర స్థానం నుంచి 2.91లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రముఖ నటుడు, యూపీలోని గోరఖ్‌పూర్ సిటింగ్ ఎంపీ, రేసుగుర్రం సినిమాలో ప్రతినాయకుడు రవికిషన్(రవీంద్ర శుక్లా).. ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌పై లక్ష పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. బెంగాల్‌లోని ఘటల్ నుంచి పోటీ చేసిన తృణమూల్ సిటింగ్ ఎంపీ, సినీనటుడు దీపక్ అధికారి బీజేపీ అభ్యర్థి హిరణ్మయి చటోపాధ్యాయపై 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే భోజ్‌పురీ నటుడు, నేపథ్య గాయకుడు పవన్ సింగ్‌కు బిహార్‌లోని కరాకట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. యూపీలోని ఆజంఘడ్ నుంచి భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీ నటిగా, మోడల్‌గా గుర్తింపు పొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్మృతీ ఇరానీ.. అమేఠీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 1.62 లక్షల ఓట్లతో ఓడిపోయారు. తమిళనాడులోని విరుద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన నటి రాధిక, అమరావతి నుంచి పోటీ చేసిన నవనీత్‌కౌర్ ఓడిపోయారు.

సందేశ్‌ఖాలీలో బీజేపీ ఓటమి

కోల్‌కతా, మే 4: సందేశ్‌ఖాలీ.. గత కొన్ని రోజులుగా వార్తల్లో విపరీతంగా వైరల్ అయిన స్థానం.. బెంగాల్ బీజేపీ నేతలు ఎక్కువగా ప్రస్తావించిన పేరిది.. ఈ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళను టీఎంసీ నాయకులు లైంగికంగా వేధించారంటూ బీజేపీ పలు ఆందోళనలు చేసింది. కానీ, ఇవేవీ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లను రాల్చలేదు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బశీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సందేశ్‌ఖాలీ కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రను టీఎంసీ అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు హాజీ నూరుల్ ఇస్లాం దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా హాజీ నూరుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "నా విజయంతో సందేశ్‌ఖాలీ గురించి ప్రచారం చేసినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ప్రజలెవరూ వాటిని నమ్మలేదు. వైరల్ చేసిన వీడియోల వెనుక బీజేపీ పాత్ర ఉందని వారు భావించారు. అందుకే బీజేపీ పన్నిన కుట్రకు నా విజయంతో చక్కటి సమాధానం చెప్పారు" అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పదును చూపిన ప్రజల విజ్ఞత

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కుపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒడ్డూపొడుపూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచిపెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బిహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగాను గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.



తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పదిహేడో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈ సారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయక బాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములను ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు, రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంతకాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితిశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. ●

మోదీ మ్యాజిక్ ఏమయింది?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహామహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014–24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత



నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.

సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకఛత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపి బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్లు ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రకృతికి సమస్య మనమే, పరిష్కారమూ మనమే!

'ప్రపంచ పర్యావరణ దినోత్సవ' స్ఫూర్తి సంవత్సరమంతా కొనసాగుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా ఉద్యమిస్తేనే సత్ఫలితాలను ఆశించగలం. ప్రకృతి వికృతరూపం దాల్చకముందే మనమంతా మేల్కొనాలి. ఈ భూగ్రహం మనకు ఆశ్రయమిస్తున్నదని, ఇక్కడ మనం తాత్కాలిక అతిథులం అనే వాస్తవాన్ని గ్రహించాలి.





'ప్రకృతికి తనకంటూ ఒక భాష ఉంది కానీ అది నిశ్శబ్దమైనది. మీరు మౌనం దాల్చే వరకు ఆ భాష మీకు అర్థం కాదు' – ఓ తత్వవేత్త ప్రకృతిని వర్ణించిన తీరిది. మనం మౌన స్థితికి చేరుకున్నప్పుడు మాత్రమే ఈ ప్రకృతి గొప్పదనాన్ని అనుభూతి చెందగలం. ఈ ప్రకృతిలోని సంగీతాన్ని ఆస్వాదించగలం. విశ్వ చైతన్యంలో లీనం కాగలం.

ఎన్నో జీవజాతులతో అలరారుతూ భూగ్రహంపై నేడు మనం చూస్తున్న జీవవైవిధ్యం 3.5 బిలియన్ సంవత్సరాల సుదీర్ఘ పరిణామం. ఈ పరిణామ క్రమంలో 'మేధస్సు' కీలక పాత్ర పోషించింది. మేధస్సు లేకపోయినా పక్షులు, జంతువులు సహజంగా ప్రకృతితో సామరస్యంగానే ఉంటాయి. తమ అవసరాల మేరకు మాత్రమే ఈ ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, ఈ ప్రకృతి సంపద మనదే అనే తాత్త్వికతను కనబరుస్తాయి. కానీ మేధస్సు కలిగిన మనిషి ప్రకృతి నుంచి తన అవసరాలను తీర్చుకుంటూనే, ప్రకృతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ తీరని నష్టం చేస్తున్నాడు. ఈ ఊపిరి ప్రకృతి పెట్టిన భిక్షే అనే విచక్షణను కోల్పోయి పర్యావరణ కాలుష్యానికి పాల్పడుతూ, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేస్తూ తన వినాశనాన్ని తానే కోరి తెచ్చుకుంటున్నాడు.

ప్రఖ్యాత తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ మనిషి వ్యవసాయం చేయడం ప్రారంభించిన తర్వాతనే జీవితంలో స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోల్పోయాడని అంటారు. ఆనాటి నుంచి తన అవసరాలను తీర్చుకునే క్రమంలో మనిషి స్వార్థపూరితుడయ్యాడు. సాంకేతికత పెరుగుతూ, ఒక్కో ఆవిష్కరణ జరుగుతున్న క్రమంలో తోటి మనిషితో పోటీ పడుతూ తనను తానే కోల్పోయాడు. తనకు ప్రాణవాయువునిచ్చే, తన ప్రాణాలను నిలబెట్టే ప్రకృతిని నిర్లక్ష్యం చేశాడు. జీవం ఉన్న ఏకైక గ్రహంగా కొనసాగుతున్న భూగ్రహంపై ఉష్ణోగ్రత, వర్షపాతం, తేమ, వాతావరణ పీడనం తదితర అంశాలు సహజస్థితిలో కొనసాగినంత కాలం జీవుల మనుగడకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అనాలోచిత మానవ కార్యకలాపాల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతూ మానవ జీవితాన్ని ప్రమాదంలో పడేశాయి.

మానవుడు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన వనరులను అవసరానికి మించి వాడుకుంటున్నాడు. తన మేధో సంపత్తితో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, అసంఖ్యాకంగా పరిశ్రమలను నెలకొల్పుతున్నాడు. పారిశ్రామిక విప్లవానంతరం జరిగిన పారిశ్రామికీకరణ, నగరీకరణ; సాంకేతికాభివృద్ధితో జరిగిన ఆవిష్కరణలు; పరిమితికి మించి పెరుగుతున్న జనాభా; వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణం; జనాభా అవసరాల కోసం అడవులను విచక్షణారహితంగా నరకడం; ఇళ్లు, పరిశ్రమలు, రవాణా కోసం చమురు, గ్యాస్, బొగ్గును వాడటం... తదితరాల వల్ల వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలు సంభవిస్తున్నాయి. పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం కలుషితమైపోతున్నాయి. శిలాజ ఇంధనాలు మండినప్పుడు, గ్రీన్ హౌజ్ వాయువులైన కార్బన్‌డైఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్ వంటి వాయువులు సూర్యుని వేడిని తమలో బంధించి, భూగ్రహంపై ఉష్ణోగ్రతలను నానాటికీ పెంచుతున్నాయి. వీటి ప్రభావంతో ప్రతికూల వాతావరణ మార్పులతో పాటు, భూగోళం సగటు ఉష్ణోగ్రతలు పెరిగి గ్లోబల్ వార్మింగ్ సమస్య తలెత్తి హిమాలయాలలోని మంచు శిఖరాలు నానాటికీ కరిగిపోతూ, నదీ ప్రవాహాలు ఉధృతమవుతూ, సముద్ర మట్టం పెరుగుతూ పోతుండడం వల్ల తీర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కరువు కాటకాలు, వరదలు, పలు జీవజాతుల అంతర్ధానం, రుతుమార్పులు వంటి ప్రకృతి వైపరీత్యాలతో మునుపెన్నడూ లేని విపత్కర వాతావరణ పరిస్థితులు మానవ సమాజాన్ని సంక్షోభం వైపు నడిపిస్తున్నాయి.

2100 నాటికి గ్లోబల్ వార్మింగ్‌ను 1.5Cకి పరిమితం చేయని పక్షంలో ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని యావత్ ప్రపంచం ఎదుర్కోబోతున్నదని పర్యావరణవేత్తలు చేస్తున్న హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని ఈ దిశగా కార్యాచరణ ప్రణాళికను కఠినతరం చేయాల్సిన ఆత్యయిక పరిస్థితి నేడు నెలకొన్నది. లేని పక్షంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భూగ్రహం 2C కంటే ఎక్కువ వేడెక్కితే ఎన్నో దారుణ పరిస్థితులను కళ్లారా చూసేందుకు మనమంతా సంసిద్ధులమై ఉండాల్సిందే. భూగోళంపై ఈ శతాబ్దం చివరి నాటికి 2.4C ఉష్ణోగ్రత పెరగనున్నదని క్లైమేట్ యాక్షన్ ట్రాక్ గ్రూప్ నివేదిక స్పష్టం చేసిన విషయాన్ని మనం మరువరాదు. పచ్చదనం పెంపొందిస్తూ, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ, వాతావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్‌లో భూగ్రహంపై ఉష్ణోగ్రత 4Cను మించిపోతుందని శాస్త్రవేత్తలు ఇప్పటికే తేల్చి చెప్పడం ప్రస్తుతం నెలకొన్న గంభీరమైన పరిస్థితిని స్పష్టం చేస్తున్నది. ఇదే జరిగితే వినాశకరమైన వడగాల్పులతో పాటు, సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరిగి లక్షలాది మంది నిరాశ్రయులుగా మారతారు. కార్చిచ్చులతో అడవుల్లో అగ్ని ప్రమాదాలు నిత్యకృత్యమవుతాయి. అటవీ సంపద క్షీణించి పచ్చని భూగ్రహం ఎడారిగా మారుతుంది. విపరీత పరిణామాలు సంభవిస్తాయి.

ప్రకృతి వైపరీత్యాలతో, వాతావరణ కాలుష్యంతో 10–15 శాతం సముద్ర జాతులు ఇప్పటికే అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నట్లు యూఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ 2022 ప్రచురించిన పరిశోధన పత్రం తేల్చి చెప్పింది. ఈ మధ్య కాలంలో గ్లోబల్ వార్మింగ్‌తో 77 రకాల జీవజాతులు అంతరించినట్లు, ప్రపంచంలోని ప్రతి నాలుగు జీవజాతుల్లో ఒకటి అంతరించిపోయే దశలో ఉన్నదని ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. పర్యావరణ పరిరక్షణకు కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలుచేయకపోతే ఈ శతాబ్దంలో కనీసం 550 జీవజాతులు అంతరించేపోయే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణ విషయంలో జరుగుతున్న అంతర్జాతీయ సమావేశాలు, అమలు చేస్తున్న చట్టాలు, కార్యాచరణ ప్రణాళికలు ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోతున్నాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలు, ప్రణాళికల అమలులో సమన్వయ లోపంతోనే ఇలా జరుగుతున్నది. రాజ్యాంగంలోని అధికరణం 48(ఎ) పర్యావరణ పరిరక్షణ, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వానికి కేటాయించగా, ఆర్టికల్ 51ఎ(జి) అడవులు, సహజవనరులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వాలకు తోడు పర్యావరణ పరిరక్షణకు ప్రజలు నిబద్ధతను కనబరిచినప్పుడే ఆశించిన లక్ష్యాలు సాధించగలం. సమస్యలకు కారకులమైన మనమే వీటి పరిష్కారానికి ఉద్యమించినప్పుడే ఫలితాలు చూడగలం. ప్రపంచవ్యాప్తంగా జటిలమైన సమస్యగా పరిణమించిన వాతావరణ కాలుష్యాన్ని నివారించే క్రమంలో మానవులంతా బాధ్యతాయుతమైన పాత్రను పోషించాల్సిన సమయం ఆసన్నమైంది.

'ప్రపంచ పర్యావరణ దినోత్సవ' స్ఫూర్తి సంవత్సరమంతా కొనసాగుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా ఉద్యమిస్తేనే సత్ఫలితాలను ఆశించగలం. ప్రకృతి వికృతరూపం దాల్చకముందే మనమంతా మేల్కొనాలి. ఈ భూగ్రహం మనకు ఆశ్రయమిస్తున్నదని, ఈ భూగ్రహంపై మనం తాత్కాలిక అతిథులం అనే వాస్తవాన్ని గ్రహించాలి. 'టు లివ్ లెట్ లివ్' అనే ఆలోచనలతో పచ్చదనం పెంపుదలకు, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి. ప్రకృతే పరమాత్మ అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడే ఈ దిశగా మన అడుగులు పడతాయి.

■ కొండా సురేఖ
అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిటోపెజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

నీట్‌లో న్యూవిజన్‌కు ర్యాంకుల పంట



విద్యార్థులతో కళాశాల చైర్మన్ సీహెచ్ జీకే ప్రసాద్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: మంగళవారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్ జీకె ప్రసాద్ తెలిపారు. కళాశాలకు చెందిన ఎం. నిహారిక 780, బి హర్షిత 1086, బి. గణేష్ 2315, వి జాగృతి పవర్ 2339, బి. పూజిత 4187, ఎల్ కార్తిక్ 5408, డి. సందీప్ 6427, బి. చైతన్యసాయి 6888, ఎం. ప్రణతి 8679, జి. స్నేహ 9530, టి. మనోతేజ 14138, ఎల్ .రుత్విక శివాని 13934, వి. రాహుల్ 16186, డి. చిన్మయి 16406 వంటి ర్యాంక్‌లతోపాటు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకొని జిల్లా టాపర్‌గా న్యూవిజన్ నిలిచిందన్నారు. న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచే ఐఐటి, అడ్వాన్స్, జేఈఈ మెయిన్స్, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో పరిమిత సంఖ్య గల విద్యార్థులతో జాతీయ స్థాయి ర్యాంకులు, ఉత్తమ మార్కులు సాధిస్తూ జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ జూనియర్ కళాశాలగా న్యూవిజన్ నిలిచిందన్నారు. విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తిక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హార్వెస్ట్ అద్భుత ఫలితాలు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఎ. జిష్ణేష్ 667, కే. ప్రియతమ్ 633, పి. పునిత్ 609, ఎం. నవదీప్ 600, ఎస్. గోకుల్ కిషోర్‌రెడ్డి 596, జి. హేమసాయి 571, కె. శారోన్‌పెర్సిస్551, ఎం. కుశల్ తేజ 516, ఈ. నాగమౌనిక 429, ఐ. అనిత 429 వంటి మార్కులు సాధించి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్

'నీట్' ఫలితాల్లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఖమ్మంలోని పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. మే 5న పరీక్ష నిర్వహించారు.

కృష్ణవేణి ఐఐటి మెడికల్ అకాడమి సత్తా

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని కృష్ణవేణి ఐఐటి మెడికల్ అకాడమి విద్యార్థులు సత్తా చాటారని కళాశాల డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీష్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్. భరత్‌తేజ 700, సీహెచ్. భరత్‌వంశీ 560, సీహెచ్. లక్ష్మీ 540, కె. స్వాతి 527, జె. దీపిక 492, ఏ. ఇందు 464, టి. కోమలి 430, జి. సాయిషైనిక 406 మార్కులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు, ఏలూరి వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, నిరంజన్ తదితరులు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

రెజోనెన్స్ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో రెజోనెన్స్ యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి ర్యాం కుల సాధించారని కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె శ్రీధర్‌రావు తెలిపారు. కళాశాలకు చెందిన జి చంద్రిక 559, వి. జోషిక 521, జి. మమత 518, ఎ. సాయిదర్శన 483, తనుష్ 468, తను 463, ఆర్. జాహ్నవి 452 వంటి మార్కులు సాధించారని తెలిపారు. డైరెక్టర్లు మాట్లాడుతూ ఇంటర్‌తోపాటే నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందించటం వల్లనే నేడు ఈ ఫలితాలు సాధించామన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విజయకేతనం



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కళాశాలకు చెందిన కె. మణిదీప్ 650, బి. మధు 627, ఎస్‌కే నసీమ 604, బి. సాయి 601, డి. సింధు 586, ఈ. కార్తికేయని 582, పి. నితిషా 574, జి. మనోహర్ 571, ఎస్‌కే జాన్‌బీ 555, టి రోహిణి 542, ఎం. బిందు 540, జి దేవిప్రియ 499, బి మానస, సిహెచ్. దివ్య 496, సీహెచ్. పద్మశ్రీ 486, భువ్రష 483, డి. విక్టర్‌పాల్ 482, కె శృతి 478, తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలు తయారుచేసి విద్య అందించటం ద్వారానే నేడు ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడామిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, చేతన్ మాదూర్, బ్రహ్మం, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమి విజయభేరి



విద్యార్థులతో డాక్టర్స్ మెడికల్ అకాడమి డైరెక్టర్లు సతీష్‌బాబు, భరణికుమార్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులతో విజయభేరి మోగించారని అకాడమి డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్ తెలిపారు. అకాడమికి చెందిన హారిక 644, పావనిశివాని 631, భగీరథ్ 594, తేజస్విని 590, ప్రత్యుష 568, జవ్వాద్ 566, మాజ్ 564, సాహితి 561, రిషిత రాథోడ్ 561, భూక్య శ్రీవిద్య 560, జాన్సీ 557, వశిష్ఠ మహర్షి 556, వాసీమ్ 556, సౌమశ్రీ 555, శ్రీజ 553, శివాని 544, పవన్‌రాజ్ 540, చరితశ్రీ 540, ప్రణవశ్రీ 540, సిరి చరిత 540, శ్రీయ 539, గాయత్రి 538, మహేశ్వరి 538, అమూల్య 536, అఖిల 536, మాలిన్ 536, అంకిత, సన్నిహిత , షైకయ్య 529, అనిష్క 525, జ్ఞానప్రసన్న 522, యోగేష్ 518, సందీప్ 513, ధన్య 513, విష్ణువర్ధన్ 511, ఖాసీమ్ 511, తోపాటు పలువురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

భవిష్య మెడికల్ అకాడమి

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 4: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని భవిష్య మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని అకాడమి డైరెక్టర్ బండి రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సుమలతలు తెలిపారు. అకాడమికి చెందిన నలుగురు విద్యార్థులు 550, ఆరుగురు 500, 15 మందికి 450, 20మందికి 400లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. 45మందికి పైగా ఫ్రీ మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ రామిరెడ్డి

8న జాతీయ లోక్ అదాలత్

▸▸ న్యాయసేవాధికారసంస్థ ఖమ్మం జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ జూన్ 4: సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ నెల 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల కేసులను రాజీ చేసుకునేందుకు ఎటువంటి రుసుము ఉండదని, కోర్టుఫీజు సైతం తిరిగిచెల్లిస్తారని, అప్పీల్ అవకాశంలేని శాశ్వత అంతిమ పరిష్కారం లభిస్తుందని దీనివలన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడటంద్వారా ఇరుపక్షాలు విజయం సాధించినట్లేనని అన్నారు. ఈ లోక్‌అదాలత్ నిర్వహించటానికి ఖమ్మంలో 7, సత్తుపల్లిలో 3, మధిర 1 లోక్ అదాలత్ బెంచ్‌లను కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులను, మోటారు వాహన ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి, గృహహింస తదితర కుటుంబ కలహాల కేసులు అన్ని రకాల సివిల్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి రూ.25 వేలలోపు కేసులు మాత్రమే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఇలాంటివి 52 కేసులు గుర్తించినట్లు తెలిపారు. అంతేగాక డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులు, కరోనా సమయంలో పెట్టిన కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, బ్యాంకు సంబంధించిన కేసులు, శ్రీరామ్‌ఫైనాన్స్, మైక్రోఫైనాన్స్ సంస్థల కేసులను కూడా దీనిద్వారా పరిష్కరించుకోవచ్చునని అన్నారు. బ్యాంకు రుణ గ్రహీతల కేసులను ప్రీ లిటిగేషన్ ద్వారా పరిష్కరించుకోవటం వల్ల కోర్టుమెట్లు ఎక్కవలసిన అవసరం ఉండదని, అంతేగాక కొంత మేరకు వడ్డీరాయితీ లభిస్తుందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో ఉన్న పెండింగ్ కేసులను కూడా సుప్రీంకోర్టు ఆదేశానుసారంగా ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందు నిమిత్తం కక్షిదారులకు ఇప్పటికే నోటీసులు సైతం జారీ చేసినట్లుగా తెలిపారు. ఈ నెల 8న జరిగే లోక్‌అదాలత్‌లో కక్షిదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని రాజీపడటం ద్వారా శాశ్వత, అంతిమ పరిష్కారం పొందటమే కాకుండా కక్షిదారులు విలువైన సమయం, డబ్బు సైతం ఆదా అవుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రాజగోపాల్

ప్రజలకు రుణపడి ఉంటాం: మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 4: ఖమ్మం లోక్‌సభ ఎంపీగా రామ సహాయం రఘురాంరెడ్డి కనీవిని ఎరుగని రీతిలో 4.67 లక్షల ఆల్ టైం రికార్డు మెజారిటీని అందించిన ఉభయ జిల్లాల ప్రజలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ వద్ద గల కిట్స్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా సమావేశంలో రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి మాట్లాడారు. 18వ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో ఖమ్మం రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ ఏర్పడిన దగ్గర నుంచి ఇంత మెజారిటీ ఎప్పుడూ రాలేదని అన్నారు.

- బీఆర్ఎస్, బీజేపీది అంతర్గత ఒప్పందం

రాష్ట్రంలో బీఆర్ఎస్ డమ్మీ అభ్యర్థులను పెట్టి ఓట్లు బీజేపీకి పడేలా చేసిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం తోనే 8 సీట్లు గెలవగలిగారని తెలిపారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కూడా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించినందుకు ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకుందాం..ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి అంటే ఈ సారి ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఇది సమష్టి విజయం

● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం, మహబూబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌లను భారీ మెజారిటీతో గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఈ విజయం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థులకు మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా భారీ ఆధిక్యత చూపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

'మహబూబాబాద్ పార్లమెంట్' ముచ్చట.

భద్రాద్రిలో... తొలి నుంచి కాంగ్రెస్ దూకుడు

భద్రాచలం, జూన్ 4: మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని భద్రాచలం అసెంబ్లీలో తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఆధిక్యాన్ని చాటారు. మంగళవారం మహబూబాద్‌లోని ఎస్సీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో మహబూబాద్ లోక్‌సభ ఓట్లను లెక్కించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు 53,637 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితకు 19,406 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌కు 10,294 ఓట్లు వచ్చాయి. ఇతరులకు 15,954 ఓట్లు రాగా 11 మంది స్వతంత్ర అభ్యర్థులకు 6,020 ఓట్లు వచ్చాయి. నోటాకు 65 ఓట్లు వచ్చాయి. కాగా బలరాంనాయక్ సమీప ప్రత్యర్థి మాలోతు కవితపై భద్రాచలం అసెంబ్లీ పరిధిలో 34,231 ఓట్ల ఆధిక్యాన్ని చాటారు.

భద్రాచలం అసెంబ్లీ పరిధిలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ 53,252 ఓట్లను సాధించగా, మహబూబాద్ లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ పరిధిలో బీఆర్ఎస్ ఓట్లు 19,406కు తగ్గాయి.

కాగా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావు 1,931 ఓట్లు సాధించగా పార్లమెంటు ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ పరిధిలో బీజేపీ 10,294 ఓట్లు వచ్చాయి.

'నాయక్' వెంటే పినపాక

మణుగూరు, జూన్ 4 : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పినపాక నియోజకవర్గం ఓటర్లు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌కు భారీ మెజారిటీని అందించారు. మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో బలరాం మొత్తం 18 రౌండ్స్‌లో ఎక్కడా కూడా మెజారిటీ తగ్గకుండా కొనసాగారు. సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపి మాలోత్ కవితపై 49 వేల 319 ఓట్ల ఆధిక్యతను నియోజకవర్గంలో సొంతం చేసుకున్నారు. 18వ రౌండ్ కౌంటింగ్ ముగిసే సరికి సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ మాజీ ఎంపీ మాలోత్ కవితకు 28, 111 ఓట్లు పోల్ కాగా, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరామ్ నాయక్ 77 430 ఓట్లు పోలయ్యాయి. దీంతో బలరామ్ నాయక్ నియోజకవర్గంలో 49,319 ఓట్ల మెజారిటీని సొంతం చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారామ్ 15,170 ఓట్లు లభించాయి.

బలరాంను అక్కున చేర్చుకున్న బొగ్గుట్ట

ఇల్లెందు, జూన్ 4: ఇల్లెందు నియోజకర్గంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. బలరాంకు ఇల్లెందు శాసనసభ నియోజకవర్గంలో సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్‌కు చెందిన మాలోత్ కవితపై 59,299 ఓట్ల మెజార్టీ లభించడం గమనార్హం. 18 రౌండ్లలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఇల్లెందు నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో బలరామ్ నాయక్ అన్ని రౌండ్లలోను ఆధిక్యం ప్రదర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కోరం కనకయ్యకు 1,09,171 ఓట్లు లభించగా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసిన బలరాం నాయక్‌కు 92,957 ఓట్లు లభించాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు తగ్గినప్పటికి సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్‌కు చెందిన మాలోత్ కవితపై విజయం లభించింది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిబానోత్ హరిప్రియకు 51,862 ఓట్లు లభించగా.. ఇల్లెందు సెగ్మెంట్‌లో లోక్‌సభ ఎన్నికల్లో కవితకు కేవలం 33,658 ఓట్లు మాత్రమే వచ్చాయి. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా రవీంద్ర నాయక్‌కు ఇల్లెందు సెగ్మెంట్‌లో కేవలం 2,568 ఓట్లు మాత్రమే లభించగా.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి చెందిన ప్రొఫెసర్ సీతారామ్ నాయక్‌కు 12,494 ఓట్లు లభించాయి. గతంతో పోలిస్తే ఈ సారి 2,100 ఓట్లు అదనంగా లభించడం గమనార్హం.

కంచుకోటలో కాంగ్రెస్ హవా

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర నష్టానికి గురైంది. బీజేపీ అనూహ్యంగా జిల్లాలో పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన అభ్యర్థులు నామమాత్ర ఓట్లు తెచ్చుకోగా, లోక్‌సభ ఎన్నికల్లో నేను సైతం పోటీలో అన్నట్టుగా సత్తా చూపించింది.

ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి 4,67,847 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 16,31,039కి ఓట్లగాను 12,40,582 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 7,66,929 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 2,99,082 ఓట్లు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 1,18,636 ఓట్లు వచ్చాయి.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్, సీపీఐ కూటమి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు కలిపి 7,33,293 ఓట్ల రాగా, బీఆర్ఎస్‌కు 4,67,639, బీజేపీ, జనసేన కూటమికి 16,976 ఓట్లు వచ్చాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికలకు మించి మెజారిటీ లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 2,66,162 ఓట్ల ఆధిక్యత లభించగా ఈ ఆధిక్యతను మించి లోక్‌సభ ఎన్నికల్లో 4,67,847 ఓట్ల మెజారిటీ సొంతం చేసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గతం కంటే ఓటుబ్యాంకు పెరిగింది. అసెంబ్లీ ఎన్నికలకంటే 2,01,685 ఓట్లు అధికంగా మెజారిటి తెచ్చుకుంది ఓటుబ్యాంకు పరంగా చూస్తే అసెంబ్లీ ఎన్నికలకంటే 33636 ఓట్లు అధికంగా తెచ్చుకుంది.

బీఆర్ఎస్ ఓటుబ్యాంకు దారుణంగా దెబ్బతినడం, బీజేపీకి క్రాస్‌కావడంతో కాంగ్రెస్ మెజారిటీ అనూహ్యంగా పెరిగింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 1,68,557 ఓట్లు కోల్పోయింది. కాగా బీజేపీ ఓటుబ్యాంకు పెరగడం చెప్పుకోదగిన విషయం. 2019లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేవలం 20,488 ఓట్లు రాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమికి 16,976 ఓట్లు లభించాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 1,18,636 ఓట్లు లభించాయి. దీంతో ఖమ్మం జిల్లాలో కూడా బీజేపీకి గతానికి మించి 1,01,660 ఓటుబ్యాంకు లభించింది. ఆంధ్రాలో టీడీపీ,బీజేపీ, జనసేన కూటమిగా కలవడంతో ఆ ప్రభావం ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంపై కనిపించింది. చివరిలో బీజేపీ, టీడీపీ కలిసి ర్యాలీలు చేయడం ద్వారా టీడీపీ సానుభూతి ఓటుబ్యాంకును బీజేపీ వేయించుకోగలిగింది. పలితంగా బీజేపీ ఓటుబ్యాంకు పెరిగింది.

ఖమ్మంలోక్‌సభ నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్ హవా ఉంటుందని అందరూ భావించారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్రమాజీమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కూడా ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బలమైన నాయకత్వం, బలమైన ఓటుబ్యాంకు ఉండడంతో అసెంబ్లీ ఎన్నికల మెజారిటీలకంటే ఈసారి ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో భారీ ఆధిక్యతలు కాంగ్రెస్ సొంతం చేసుకుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెంది డీలా పడిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో కష్టించి పనిచేయలేదు ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరారవు విజయం కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర,మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు మాజీ ఎమ్మెల్యేలు కృషి చేసినా అధికార కాంగ్రెస్‌తో పోటీపడే పరిస్థితి కేడర్‌కు లేకపోవడంతో గ్రామ, పట్టణస్థాయిలో మొక్కుబడిగానే ఎన్నికల్లో పాల్గొన్నారు. ఫలితంగా బీఆర్ఎస్ ఓటుబ్యాంకు అసెంబ్లీకంటే దారుణంగా తగ్గింది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ సునామిలా దూసుకెళ్లి భారీ ఆధిక్యతను చాటింది. రాష్ట్రంలో నల్గొండ తర్వాత ఖమ్మం మెజారిటీ రెండవ స్థానంలో నిలిచింది. ముగ్గురు మంత్రులతో పాటు సినీ హీరో వెంకటేష్, ఆయన కుమార్తె కూడా ఎన్నికల ప్రచారం సాగించారు. మంత్రి పొంగులేటి వియ్యంకుడైన రఘురాంరెడ్డి అనూహ్యంగా చివరి నిమిషంలో కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుని ఎన్నికల బరిలో నిలిచారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా భారీ మెజారిటీ ఉంటుందని మొదటి నుంచి ప్రచారం సాగింది. ఒక దశలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు పోటీచేస్తారని వారి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే వారు చివరి నిమిషంలో పోటీచేయమని చెప్పడంతో చివరికి రఘురాంరెడ్డి టికెట్ వరించింది. ఇప్పుడు ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో విజయం కూడా వరించింది. రఘురాంరెడ్డి గెలుపుతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబురాలలో మునిగి తేలారు. కాంగ్రెస్ విజయం కోసం సీపీఎం, సీపీఐతో పాటు టీడీపీలోని ఒక వర్గంకూడా మద్దతు ప్రకటించింది. దీంతో రఘురాంరెడ్డి విజయం నల్లేరు మీద నడకలా సాగింది.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి

● పరిశీలించిన కలెక్టర్ వీపీ గౌతమ్


ఖమ్మం కలెక్టరేట్, జూన్ 4: ఎన్నికలలో చివరి అంకమైన ఖమ్మం లోకసభ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన లెక్కింపు కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ లెక్కింపు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, వేణుగోపాల్, ఎం. రాజేశ్వరి, గణేష్, రాజేందర్, మధు ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ జరిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. సంజయ్ జి కోల్టే, లెక్కింపు పరిశీలకులు ప్రేదిమాన్ కృషన్ భట్‌లు ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు పకడ్బందీ ప్రణాళికతో చేసిన ఏర్పాట్లతో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యింది. ఉదయం 5.00 గంటల నుండే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలు తెరిచారు. కౌంటింగ్ సిబ్బంది మూడవ రాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా సిబ్బందిని ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి ఓట్ల లెక్కింపు పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలు చేశారు.



పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న సిబ్బంది


ఖమ్మం జిల్లా నుంచి మరో ఎంపీ

● నాగర్‌కర్నూల్‌లో మూడోసారి గెలిచిన డాక్టర్ మల్లు రవి



డాక్టర్ మల్లు రవి

వైరా, జూన్ 4: ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 18వ లోక్‌సభకు మరో ఎంపీ ప్రాతినిధ్యం వహించనున్నారు. అది కూడా ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి మరో సారి ఆ అరుదైన అవకాశం లభించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి మూడోసారి విజయఢంకా మోగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌పై డాక్టర్ రవి విజయకేతనం ఎగురవేశారు. దాదాపు నాలుగున్న దశాబ్ధాల కాంగ్రెస్ రాజకీయాల్లో కేంద్ర, రాష్ట్రాల్లో రాణిస్తున్న మల్లు కుటుంబాన్ని ఎంపీ పదవి వరించింది. మల్లు కుటుంబంలో పెద్దవాడైన మల్లు అనంతరాములు తొలిసారి 1980లో నాగర్‌కర్నూల్ నుంచే కాంగ్రెస్ ఎంపీగా ఎన్నికయ్యారు. 1985లో అనంతరాములు ఓడినప్పటికీ తిరిగి మళ్లీ 1989లో నాగర్‌కర్నూల్ నుంచే ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు. 1990 ఫిబ్రవరి ఏడోతేదీన అనంతరాములు హఠాన్మరణం చెందడంతో ఆయన రాజకీయ వారసుడిగా సోదరుడు డాక్టర్ మల్లు రవి 1991లో నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన 1996లో ఓడిపోయినప్పటికీ 1998 జరిగిన ఎంపీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. ఇప్పుడు మళ్లీ నాగర్‌కర్నూల్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ముచ్చటగా మూడోసారి విజయకేతనం ఎగురవేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు డాక్టర్ రవి స్వయాన అన్నయ్య. డాక్టర్ రవి విజయంతో స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



పాలిసెట్ స్టేట్‌ర్యాంకర్‌కు అభినందన



హరీష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ రమేష్‌బాబు

పెనుబల్లి,జూన్4: టీఎస్ పాలిసెట్ ఎంట్రెన్స్‌లో పెనుబల్లి రమేష్ స్కైస్కూల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధిం చటంతో పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. మంగళవారం పెనుబల్లి రమేష్ స్కైల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాల కరస్పాండెంట్ కురివేటి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ గంగాభవానిలు హరీష్‌ను అభినందించారు. పాలిసెట్ ఎంపీసీ విభాగంలో హరీష్ 120కి 120మార్కులు సాధించి రాష్టస్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా, బైపీసీలో రాష్ట్రస్థాయిలో ఏడోస్థానం దక్కించుకున్నాడు.

రాగమయి.. అంతాతానై

- భారీమెజారిటీతో పెరిగిన సత్తుపల్లి ఎమ్మెల్యే ప్రతిష్ఠ
- లక్ష్యానికి మించి మెజారిటీతో కేడర్‌లో జోష్

సత్తుపల్లి, జూన్ 4 :ఖమ్మం లోక్ సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో సత్తుపల్లి సెగ్మెంట్ నుంచి తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి మెజారిటీ సాధించటం ద్వారా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రతిష్ఠను పెంచుకున్నారు. నియోజకవర్గం 1951లో వేంసూరు కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి, ఆ తరువాత సత్తుపల్లి కేంద్రంగా మారిన తరువాత ఇప్పటి వరకూ అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగిన ఏ ఎన్నికల్లో కూడా ఇక్కడ ఈ స్థాయి మెజారిటీ ఏ ఒక్క అభ్యర్థికీ దక్కలేదు. లోక్‌సభకు సత్తుపల్లి సెగ్మెంట్‌లో పోలైన ఓట్లలో కాంగ్రెస్‌కు 61.74శాతం ఓట్లు సాధించటం విశేషం. ఎన్నికల ప్రచార సమయంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 19,440 ఓట్లు ఆధిక్యత లభించిందని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సత్తుపల్లి సెగ్మెంట్‌లో 50వేలకు పైగా మెజారిటీ సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు పట్టుదలతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్‌లు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు వారు పార్టీ కేడర్‌ను సిద్ధం చేశారు. 50 మెజారిటీ లక్ష్యం దాటి పోవటంతో ఇటు పార్టీలో ఎమ్మెల్యే రాగమయి ప్రతిష్ఠ పెంచుకున్నట్లు అయింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థి ప్రకటన రాకముందు నుంచే డాక్టర్ రాగమయి, డాక్టర్ దయానంద్‌లు మండలాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించి కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేసారు. నియోజకవర్గంలో పాతతరం కాంగ్రెస్ నాయకులు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులను సమన్వయం చేస్తూ ముందుకు నడిపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసిన వారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్‌లో చేరే వారిలో కొందరికి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ చెక్ పెట్టారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల సమ్మతి లేకుండా తాము బీఆర్ఎస్ నుంచి వచ్చే వారిని పార్టీలో చేర్చుకోబోమని తేల్చి చెప్పారు. స్థానిక నాయకుల సమ్మతి ఉన్న వారిని మాత్రమే పార్టీలో చేర్చుకున్నారు. కాంగ్రెస్ కేడర్‌ను ఎన్నికల్లో పని చేయించటంలో సఫలమయ్యారు. ముఖ్యంగా సత్తుపల్లి సెగ్మెంట్‌లో ప్రధానంగా రాజకీయ బలం ఉన్న కమ్మ సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్‌కు దూరమవుతాయని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీనికి చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్‌లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసికెళ్ళటంతో తుమ్మల ఈ నియోజకవర్గంలో పలువురితో మాట్లాడటం, ఆ సామాజిక ఓటు బ్యాంకు కాంగ్రెస్‌వైపు పూర్తిగా మళ్ళే విధంగా తీసుకున్న చర్యలు భారీ మెజారిటీకి దారితీసింది. మొత్తంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో 19,440 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన రాగమయి ప్రస్తుత ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించటం ద్వారా పార్టీలో ఇమేజ్ పెంచుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

ఆశించిన మెజారిటీ సాధించాం

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి,జూన్4: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఆదినుంచి తాము విశ్వసించామని, ఇందులో భాగంగానే తాము ఆశించిన మెజారిటీ సత్తుపల్లి సెగ్మెంట్ నుంచి లభించిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం ఆమె ఖమ్మంలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో భారీ మెజారిటీతో విజయం సాధించిన రఘురామిరెడ్డిని కలసి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈ ఎన్నికల్లో కనీసం 50 వేలకు మించి మెజారిటీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకొని పని చేసామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సత్తుపల్లి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని నియోజకవర్గ ప్రజలు గమనించారని అందుకే ఏకపక్షంగా ప్రజలు కాంగ్రెస్‌ను దీవించి 76వేలకు పైగా మెజారిటీ ఇచ్చారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థినిగా తనకు వచ్చిన మెజారిటీ కంటే అయిదు రెట్లు మెజారిటీ ఈ ఎన్నికల్లో వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. తమతో పాటు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మిత్రపక్షాలకు, ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్కలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మాక్ పోలింగ్ రీసెట్ చేయని అధికారులు

వైరాలోని 202 పోలింగ్ బూతులో లెక్కించని ఓట్లు

వైరా, జూన్ 4: వైరాలోని 202పోలింగ్ స్టేషన్‌లో పోలైన ఓట్లను లెక్కించలేదు. మాక్‌పోలింగ్ తర్వాత కంట్రోల్ యూనిట్‌ను రీసెట్ చేయని ఫలితంగా మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఈ పోలింగ్ బూతులో పోలైన ఓట్లను లెక్కించలేదు. గతనెల 13న జరిగిన ఎంపీ ఎన్నికల్లో 202 పోలింగ్‌బూతులో 676ఓట్లు పోలయ్యాయి. ఆరోజు పోలింగ్‌కు ముందు పీవో, ఏపీవో, ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆతర్వాత మాక్ పోలింగ్‌ను రీసెట్ చేసి అనంతరం పోలింగ్‌ను కొనసాగించాల్సి ఉంది. అయితే మాక్ పోలింగ్ తర్వాత రీసెట్ చేయలేదు. ఫలితంగా ఓట్ల లెక్కింపులో ఈ విషయం బయటపడటంతో కంట్రోల్ యూనిట్‌ను ఓపెన్ చేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ రావడంతో ఈ పోలింగ్ బూతులోని ఓట్ల లెక్కింపును పరిగణలోకి తీసుకోవడం లేదని కౌంటింగ్ అధికారులు ఏజెంట్లకు స్పష్టం చేశారు. ఈ బూతులో వేసిన ఓట్లు మురిగిపోయినట్లయింది.

తిరుమలాయపాలెంలో కాంగ్రెస్‌కు ఆధిక్యత

తిరుమలాయపాలెం, జూన్4: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత లభించింది. గత అసెంబ్లీ ఎన్నికలకంటే సుమారు 3వేల మెజారిటి వచ్చింది. ఖమ్మం పార్లమెంట్ కు బీఆర్ఎస్‌నుంచి నామా, కాంగ్రెస్ నుంచి రఘురాంరెడ్డి నిలిచారు. రఘురాంరెడ్డికి సుమారు 11వేల మెజారిటీ లభించింది. ఆదినుంచి కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోటలా తిరుమలాయపాలెం మండలం ఉంటుంది. సుబ్లేడులో జిల్లానాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి కేక్‌కట్ చేసి పంచారు. తిరుమలాయపాలెం జిల్లానాయకులు చావా శివరామకృష్ణ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ బెల్లం శ్రీను, కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, ముదిరెడ్డి మోహన్‌రెడ్డి, ముక్కపాటి నాగేశ్వరరావు, ముక్కపాటి రంగా, బోడపట్ల నరసయ్య పాల్గొన్నారు.

కామేపల్లిలో అసెంబ్లీ కంటే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ

కామేపల్లి, జూన్ 4: కాంగ్రెస్ పార్టీ గెలుపు అసెంబ్లీలో కంటే పార్లమెంట్ ఎన్నికల్లోనే అత్యధిక మెజారిటీ సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియపై కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కామేపల్లిలో 8299 ఓట్లతో ఆధిక్యం సాధించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపించుకోవడమే కాకుండా 11682 మెజారీటిని కామేపల్లిలో సాధించారు. అసెంబ్లీలో కంటే పార్లమెంట్లలో 3383 ఓట్ల ఆధిక్యం సాధించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి సారధ్యంలో ప్రతి కార్యకర్త పని చేస్తూ పార్టీని గెలిపించుకుంటున్నారు.

మధిర పోస్టల్ ఓట్లలో బీఆర్ఎస్ కన్నా బీజేపీకే ఎక్కువ

మధిర: పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కాంగ్రెస్‌కు భారీగా పడగా, బీఆర్ఎస్‌కు బీజేపీ కన్నా తక్కువ రావడం చర్చనీయాంశమైంది. ఉద్యోగ వర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల ఉన్న వ్యతిరేకత ఓట్లద్వారా స్పష్టంగా కనిపించింది. పోస్టల్ ఓట్లు కాంగ్రెస్‌కు 7,326 రాగా బీఆర్ఎస్‌కు 1,490 మాత్రమే వచ్చాయి. బీజేపీకి 1,561 ఓట్లు రావడం విశేషం. ఇది బీఆర్ఎస్ అభ్యర్థికి వచ్చిన వాటికన్నా అధికం కావడం చర్చనీయాంశమైంది.



మధిరలో బీజేపీ నాయకుల సంబురాలు



ఖమ్మం చైతన్యనగర్‌లో..



నేలకొండపల్లిలో..



కల్లూరులో..



వైరా టీడీపీ కార్యాలయం ఎదుట సంబురాలు



గొల్లపూడిలో టీడీపీ యువత సంబరాలు

కూటమి విజయం.. జిల్లాలో హర్షం

ఏపీలో గెలుపుతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు





సత్తుపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తుమ్మల యుగంధర్, ఖమ్మం టీడీపీ కార్యాలయంలో..



తల్లాడలో...



సత్తుపల్లి టీడీపీ కార్యాలయంలో.



ఎర్రుపాలెంలో..



కోర్టులో..





విప్పలమడక, నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ విజయోత్సవ సంబరాలు



కూసుమంచిలో..



పెనుబల్లిలో..



గోల్లపాడులో..



కారేపల్లిలో..



తాళ్లగూడెంలో సంబరాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు



ఏన్కూరులో..

నేడు వాహనం వేలం

నేలకొండపల్లి, జూన్4:నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు నేలకొండపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.జగన్నాధరావు ఓప్రకటనలో తెలిపారు. వాహనానికి ప్రభుత్వం ధర రూ.3లక్షల ధరను నిర్ణయించినట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే ఆసక్తి కల వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50శాతం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు తెలిపారు.

పేద మహిళకు కుట్టుమిషన్ వితరణ



తల్లాడ, జూన్ 4: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడలో మంగళవారం వేమిరెడ్డి ధనుంజయ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిరుపేద మహిళ జీవనోపాధికి కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు కర్నాటి లక్ష్మారెడ్డి, షేక్.కమాల్, వేమిరెడ్డి సీతారామిరెడ్డి, గుర్రాల రామబ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

విధులకు ఆటంకంపై ఫిర్యాదు

కొణిజర్ల,జూన్4: విధులకు ఆటంకం కలిగించడమే కాకుండ దాడి చేశారని మల్లుపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కలసాని అనూష పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన్నట్లు ఎస్ఐ శంకర్‌రావు మంగళవారం తెలిపారు. గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ధరావత్ నరసింహ, శైలజ, యువ జేసీబీతో అటవీ భూమిని చదునుచేస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది వెళ్లి జేసీబీని తీసుకొస్తుండగా సదరు ముగ్గురు ఫారెస్ట్ సిబ్బందిని అటకాయించి వారి విధులకు ఆటంకం కలిగించారు. కర్ర, చేతులతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ముగ్గురుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలాయపాలెం, జూన్4: ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయచంద్ర హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దమ్మాయిగూడెం, పిండిప్రోలు, గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, ఓఫామ్స్, బిల్లులు , కంపెనీ లైసెన్సులు తనిఖీ చేశారు. ప్రభుత్వం విధించిన ధరలకంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవోలు బాలకృష్ణ, నవనిత, ఆసియా, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గెలిచింది

మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు



ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్4: దేశంలో మత విద్వేషాలు, బుల్డోజర్ రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని, దేశంలో ప్రజాస్వామ్యం గెలిచిందని సీపీఐ(ఎంఎల) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. మంగళవారం పోలింగ్ జరిగిన లోక్‌సభ ఫలితాలపై ఆయన స్పందించారు. నిరుద్యోగం, అవినీతి, కార్పొరేటీకరణ అనుకూల నిర్ణయాలు, నిరంకుశ విధానాలను ప్రజలు తిప్పికొట్టారని పేర్కొన్నారు. రాజ్యాంగబద్దంగా ఏర్పడిన సంస్థలను నిర్వీర్యం చేసిన ప్రజలు ప్రజాస్వామ్య తీర్పును ఇచ్చారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై దేశ ప్రజలు ఆదర్శవంతమైన తీర్పును ఇచ్చారని అభినందించారు. బెంగాల్, తమిళనాడు, యూపీ, మహారాష్ట్ర, కేరళ ఫలితాలు ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. ఇండియా కూటమీ మరింతగా బలపడాలన్నారు. టీడీపీ, జేడియూ కూటమీలు ఇండియా కూటమీ వైపు రావాలని కోరారు.

రామసహాయం గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల ఆనందోత్సాహం



రఘురామను హత్తుకుంటున్న రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 4: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డిని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. వామపక్ష పార్టీలు బలపర్చిన రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు చారిత్రాత్మకమని వారు కొనియాడారు. అలాగే రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు రామసహాయం రఘురాంరెడ్డిని అభినందించారు. శాలువాలతో సత్కరించారు.





రఘురాంరెడ్డిని అభినందిస్తున్న సీపీఐ,సీపీఎం నాయకులు, శుభాకాంక్షలు తెలుపుతున్న బండి



మధిరలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు





తల్లాడలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, విజయోత్సవ సంకేతం చూపుతున్న మువ్వా